# ముగింపులేని కథ ముగిసింది

## కె. ఆర్. కె. మోహన్

వెంకటపతి మంచి రచయిత. అలాగని గొప్ప పేరున్న రచయితమాత్రం కాదు. పట్టుకొమ్మలాంటి గవర్నమెంట్ ఉద్యోగం పొట్టకూటికోసం చేసుకుంటూ తీరిక సమయాల్లో రచనలు చేస్తుంటాడు. ఆకర్షణీయమైన పోటీలు ప్రకటించినప్పుడు తీరికచేసుకుని హడావుడిగా రాస్తుంటాడు. అతని రచనలకు కొన్ని బహుమతులు వచ్చాయి కూడా. అయితే ఈనాటి కొందరు రచయితలలాగా రచనల మీద లక్షలు ఆర్జించి లక్షణంగా బ్రతికే స్థాయికి మాత్రం ఎదగలేదు. బహుశా ఆ స్థాయికి ఎప్పటికీ ఎదగలేక పోవచ్చుకూడా. అతను రాసినవి రాసిలో తక్కువైనా వాటిలో చాలావాటికి వాసి, వన్నె ఉన్న కారణంగా అతనికి ఒక మంచి రచయితగా గుర్తింపు వచ్చింది. దానికితోడు ఇంగ్లీషులో కూడా అప్పుడప్పుడు రాస్తుండడం, అవి ఉత్తరభారత పత్రికలో వస్తుండడం కూడా జరుగుతుంటుంది. ఆదేవిధంగా తెలుగులో వచ్చిన కొన్ని మంచి కథల్ని అతను

చక్కగా ఇంగ్లీషులోకి అనువదించి ఆంగ్ల పత్రికలకు పంపుతూండడం, వాటిలో కొన్ని ప్రచురితమవుతుండడం కూడా అప్పుడప్పుడు జరుగుతుంటుంది.

వెంకటపతి ఎక్కువగా రాయలేక పోవడానికి మరో కారణం ఉంది. ఆతనికి పుస్తకాలు, పత్రికలు చదవడ మంటే ప్రాణం. ప్రాణం అనడంకంటే పిచ్చి అంటే బాగుంటుంది. ఇంగ్లీషువి సరేసరి. తెలుగులో వచ్చే ప్రముఖ వార పత్రికలు, మాసపత్రికలూ అన్నీ చదువు తూనే ఉంటాడు.

ఆఫీసు వదిలిపెట్టాక దగ్గర్లోవున్న న్యూస్‌స్టాల్‌కి వెళ్ళి ఆ రోజు వచ్చిన వారపత్రిక కొన్నాడు వెంకటపతి.

అక్కడే నిలబడి ఆ వారం అందులో ఏ ముం దో న ని తిరగేయసాగాడు. అందులో తెలుగు సాహిత్య సామ్రా జ్యాన్ని ఏకఛత్రంగా ఏలుతున్న (కిట్టని వాళ్ళ మాటల్లో చీల్చి చెండాడుతున్న) ఇద్దరు రచయితల సీరియల్స్, నిచ్చెనపై త్వరత్వరగా ఎక్కుతున్న మరో వర్ధ మాన రచయితల సీరియల్ ముచ్చటగా మూడున్నాయి. అవి ఉండి తీరాల్సినవి. సీరియల్స్‌ని పత్రికలలో సాధారణంగా చదవడు వెంకటపతి. అవి ఎలాగూ విజయవాడ పబ్లిషర్స్ పుణ్యమా అని సీరియల్ పత్రికలో అయిపోవడంతోటే పుస్తకాలుగా నవలారూపంలో నవనవ లాడుతూ వస్తాయి అప్పుడు చదవచ్చు, ఇకపోతే కథలు- వాటిని ఆసక్తిగా చదువుతాడు. ఎవరైనా కొత్త రచయిత పేరు కన్పిస్తే మరింత ఆసక్తిగా చదువుతాడు.

కొంచెంసేపు పేజీలు హడావుడిగా తిప్పి, ఆ తర్వాత పత్రిక చూస్తూనే పేవ్‌మెంట్ మీద నడవసాగాడు.

బస్‌స్టాప్ దగ్గర్లోవున్న స్టేషనరీ షాప్‌లో చిన్నకూతురు చెప్పిన రెండు రికార్డ్ నోట్‌పుస్తకాలు కొన్నాడు.

అక్కడనుంచి బస్‌స్టాప్‌కి వచ్చి బస్‌షెల్టర్‌లో కూర్చున్నాడు వెంకట పతి.

మరో ఐదు నిమిషాలలో తన కాలనీ బస్ వస్తుంది.


ఓసారి పేపర్లో ఓ పేరా చదవడం, బస్ వస్తోందేమోనని చూడడం- ఈ విధంగా మెదకి పని కల్పించాడు. చూస్తుండగానే బస్ వచ్చింది.

నిండుచూలాల్లాగా, కడుపుతోవున్న తేలులాగా, వ్రేలాడుతున్న జనంతో వేగంగా వచ్చి, ఆగకుండానే దూసుకు పోయింది కాలనీ బస్.

మరో నలభై నిమిషాలకి కాని మరో బస్‌లేదు.

అందువల్ల ఉసూరుమంటూ, కాస్త వేడివేడి కాఫీ త్రాగివద్దామని దగ్గర్లోవున్న హోటల్‌కి బయలుదేరాడు వెంకటపతి.

సాధారణంగా పెద్ద హోటల్స్‌కి వెళ్ళడు వెంకటపతి, వాటిలో రుచి




బాగున్నా లేకపోయినా ధరమాత్రం బాగా ఉంటుంది. చిన్న హోటల్స్ చాలా వాటిలో ధర తక్కువ రుచి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఒక్కడూ అయితే చిన్న హోటల్స్‌కే వెళ్తాడు.

స్నేహితులు, పెద్దవాళ్ళు ఉన్నప్పుడు మాత్రం పెద్ద హోటల్స్‌కే వెళ్తాడు.

మరి ఫాల్స్ ప్రెస్టేజి మెయిన్‌టైన్ చేయాలి కదా!

హోటల్లో కొంచెం వెనగ్గా వెళ్ళి మూలసీటు దగ్గర కూర్చున్నాడు.

సర్వర్ వచ్చి ఏంకావాలి అని అడగటంపోయి, వెంకటపతి చేతిలో మడిచివున్న పత్రికను చూస్తూ, "అది ఏ పత్రిక సార్?" అని అడిగాడు.

వెంకటపతికి ఒళ్ళు మండింది.

'ఈ రోజుల్లో ప్రతివాళ్ళూ తెలివి మీరారు, ఏ పత్రికైతే వీడికెందుకో... బోడిగాడు' అని మనసులోనే అనుకున్నాడు.

పైకి మాత్రం ఏమీ అనకుండా, అతని ప్రశ్నకు సమాధానం చెప్పకుండా "స్ట్రాంగ్ కాఫీ అర్జంటుగా తేవాలి. బస్ టైం అవుతోంది" అని ఒక్కబిగిని అన్నాడు.

సర్వర్ ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. ఆలస్యం చేయకుండానే ట్రేలో కాఫీ తెచ్చి ముందుంచాడు.

వెంకటపతి పత్రికను ఖాళీగా వున్న ప్రక్క కుర్చీలో పెట్టి కాఫీకప్ తీసుకున్నాడు.

వెంటనే సర్వర్ ఆత్రంగా ఆ పత్రికను తీసుకుని త్వరత్వరగా పేజీలు తిరగవేయసాగాడు.

వెంకటపతికి కాలుకొచ్చింది.

మూడో కన్ను ఉండివుంటే వెంటనే

సర్వర్ ని భస్మీపటలంచేసి ఉండేవాడే. కాని అంత తీక్షణంగానూ చూశాడు. "అదెందుకు తీస్తావు? అక్కడ పెట్టు," అన్నాడు కటువుగా 'పట్టరాని కోపాన్ని పట్టు బలవంతంమీద ఆపుకుంటూ.

మారు మాట్లాడకుండా పత్రిక అక్కడ పెట్టేసి, "సారీ సర్" అని బిల్ తేవడానికి వెళ్ళాడు.

'ఇంతోటి ఉద్యోగానికి వీడికి బోడి ఇంగ్లీషు కూడాను. వెధవ్వేషాలూ వీడూను.' అంటూ మనసులో విసుక్కున్నాడు.

సర్వర్ బిల్ తీసుకురాగానే వాడివంక ఓసారి కోపంగా చూసి ఆ బిల్ తీసుకుని కౌంటర్ దగ్గరకు వెళ్ళాడు.

బిల్ పే చూస్తూ "చూడండి. మీ సర్వర్లకి కొంచెం బుద్ధి చెప్పండి. సప్లయిమీద కంటే పత్రికల మీద శ్రద్ధ ఎక్కువయింది," అంటూ కంప్లయింట్ చేశాడు వెంకటపతి.

"ఎవరూ నటరాజా!" అంటూ ఆ మూలగా చూశాడు ప్రొప్రయిటర్.

"నటరాజూ, విటరాజూ- ఆ చివరి టేబుల్ దగ్గిర సప్లయర్," అంటూ వెనక్కి తిరిగి చూశాడు.

"వాడికి పత్రికలన్నా, పుస్తకాలన్నా పరమ పిచ్చి సార్. చెప్పిచెప్పి విసిగిపోయాం. చివరికి ఏదో ఓ రోజున ఉద్యోం ఊడపీకాల్సి వస్తుంది, కాని-" అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు ప్రొప్రయిటర్. అదేమీ వినిపించు కుండా బయటపడి, బస్ షెల్టర్ లో పోయి కూర్చున్నాడు వెంకటపతి.

పత్రిక తెరిచి పేజీలు తిరగవేయడం మొదలెట్టాడోలేదో ప్రక్కనున్న పెద్ద మనిషి "మాస్టారూ... ఓసారి పత్రిక ఇస్తారా?" అన్నాడు.

నమలకుండా మింగేద్దామన్నంత కోపం వచ్చింది వెంకటపతికి. ఆయన వంక చూశాడు.

మనిషి మంచి బట్టల్లో, బాగా చదువుకున్నవాడిలాగా, మంచి ఉద్యోగమే చేస్తున్నవాడిలాగా కనిపించాడు.

'హుఁ— మన తెలుగు వాళ్ళకున్న తెగులే ఇది. పత్రిక కొనాలంటే ఏడ్చి చస్తారు. బేవార్స్‌గా చదవడమంటే పడి చస్తారు' అనుకుంటూ పెదవులు బిగించి లోపలే పళ్ళు కొరుక్కున్నాడు.

"మాస్టారూ-అసలు ఈ వారం ఏమి వచ్చాయో కంటెన్ట్స్ చూసి ఇచ్చేస్తాను." అన్నాడు మళ్ళీ ఆ పెద్దమనిషి వెంకటపతి భావాల్నేమీ గ్రహించకుండా.

ఇంక తప్పదనుకుని విసుగ్గా పత్రికను ఆ పెద్దమనిషికిచ్చాడు.

ఇంతలో ఓ బస్ వచ్చింది.

దాని నంబరు సరిగ్గా కనిపించడం లేదు.

నంబర్ చూడాలని వడివడిగా బస్ ముందుకి వెళ్ళాడు వెంకటపతి. అది తనది కాదు.

...టనే తిరిగి షెల్టర్‌లోకి వచ్చాడు.
...బస్ వెళ్ళిపోయింది.

పక్కనచూస్తే పేపరు తీసుకొన్న పెద్దమనిషి లేడు.

కంగారులో తిరిగియ్యడం మరచిపోయి బస్సెక్కేశాడో, కావాలనే చంక నెట్టుకుని ఉడాయించాడో, ఆ పెద్ద మనిషికీ, ఉంటే దేవుడికీ తెలియాలి.

ఆ పెద్దమనిషిని మనసారా మనసులో తిట్టుకుంటూ కూర్చున్నాడు.

కాలం గడుస్తూందే కాని కాలనీ బస్ రావడంలేదు.

ఏమీ తోచక విసుగ్గా ఉండి, చేతిలోని పేకెట్‌ని అటూఇటూ తిప్పసాగాడు.

దానిమీద కట్టిన రేపర్ ఏదో వార పత్రికలోది

ఏదో కథలాగా అనిపిస్తోంది.

కాలక్షేపంకోసం అదేమిటో చూద్దామని చదవటం మొదలుపెట్టాడు.

అది మామూలు వారపత్రిక సైజులోనే ఉన్న పత్రిక.

పేరుకాని, దాని తేదీకాని, రచయిత పేరుకాని కనిపించడం లేదు. కథలో మొదటి పేజీ లేదు.

అందువల్ల కథ పేరుకాని, రచయిత పేరుకాని తెలియలేదు. ఓసారి ఆ పాకెట్‌ని అటూఇటూ తిప్పి చదవటం మొదలుపెట్టాడు. కొంచెం చదవగానే ఎంతో ఆసక్తిని రేకెత్తించింది ఆ కథ.

చక్కని శైలి,

అద్భుతమైన శిల్పం.

మనసుని హరించే కథనం.

అది డిగ్రీ చదువుకున్న నిరుద్యోగి కథ

అడుగడుగునా అపజయాలు ఎదురవుతున్నా జీవనసమరం సాగిస్తూ, కొవ్వొత్తిలా కరిగిపోతున్న ఒక ఉదాత్తుని కథ.

ఇతివృత్తంలో కొత్తదనం లేకపోయినా, పాత్ర చిత్రణేమిటి మిగిలిన అంశాలేమిటి - అన్నీ ప్రత్యేకంగా ఉన్నాయి. తాను ఎన్నో కథలు చదివాడు. ఎందరివో ప్రత్యేకంగా చదివాడు కాని అది రాసింది ఎవరై ఉంటుందో గుర్తుపట్టలేకపోయాడు. పేకెట్‌ని మొత్తం విప్పి చదివాడు.,

ఉన్నది నాలుగుపేజీలే, చివరి పేజీలు లేవు.

కథ ఎలా మొదలైందో తెలీదు. ఎలా ముగిసిందో తెలీదు.

మనసంతా ఆ కథలోనే లీనం అయిపోయింది.

ఎవరీ రచయిత!

ఎంత అద్భుతంగా రాశాడు.

అతని రచనల నేవి తను చదివినట్లనిపించలేదు.

ప్రతి విషయంలోనూ అందులో నవ్యత్వం కనిపిస్తోంది.

పేరు చెప్పకపోయినా, శైలినిబట్టి చాలామంది రచయితలను గుర్తుపట్ట

గలడు వెంకటపతి.

కాని ఈ రచయిత ఎవరో మాత్రం అంతుబట్టలేదు.

అసలు ఆ కథ రాసింది రచయితో రచయిత్రో- అదీ తెలీదు.

వెళ్ళాల్సిన బస్ రావడంతో వెంకటపతి ఆలోచనలకి బ్రేక్ పడింది.

ఆ పేపర్ ని మడిచి భద్రంగా జేబులో పెట్టుకున్నాడు.

రికార్డ్ నోట్ బుక్స్ పట్టుకుని బస్ ఎక్కాడు.

* * *

ఇంటికి వెళ్ళాకకూడా. ఆ అజ్ఞాత రచయిత కథే వెంకటపతిని వెంటాడ సాగింది.

రాత్రి నిద్రకూడా సరిగా పట్టలేదు.

ఎంత సేపూ ఒకటే ఆలోచన - ఆ కథ ఎలా ముగిసింది?

అసలు అది కథ అనిపించడంలేదు. నిజ జీవితానికి దర్పణంలా ఉంది. ఎలాగైనా ఆ కథపడిన పత్రిక ఏదో తెలుసుకోవి. ఆ కాపీ సంపాదించాలి.

వీలైతే ఆ రచయితతో పరిచయం చేసుకోవాలి.

కలత నిద్రపోయాడే కాని. కలల్లో కూడా ఆ కథే రాసాగింది.

* * *

మర్నాడు ఆదివారం.

ఆఫీసు లేకపోవడంతో బజారుకి బయిలుదేరాడు వెంకటపతి.

న్యూస్ స్టాల్ కి వెళ్ళి ఆ పత్రిక ఉంటుందో చూడాలనుకున్నాడు.

ప్రముఖ పత్రికల ఫార్మాట్ గెటప్, టైప్స్ వగైరా అన్నీ అతనికి బాగా తెలుసు.

అయినా మరోసారి చూశాడు. ఆ పత్రిక మాత్రం వాటిలో లేదు. అంతగా సర్క్యులేషన్ లేని, ఎక్కువగా అమ్ముడు పోని చిల్లరమల్లర పత్రికలెన్నోకూడా న్యూస్ స్టాల్స్ లో దర్శనం ఇస్తుంటాయి. ఒకవేళ ఏదేనా అటువంటి పత్రికలో ఆ కథ పడిందేమోనని ఎన్నో చోట్ల ఎన్నెన్నో వాటిని చూశాడు. కాని అటువంటి పత్రికేది కనిపించలేదు. బహుశా పుట్టలో పుట్టి మట్టిలో మాడిపోయిన బాపతు పత్రికేదో అయ్యుంటుందన్న నిర్ధారణకొచ్చాడు వెంకటపతి.

ఇంత ఇదికాదు పని అనుకొని జిల్లా గ్రంథాలయానికి వెళ్ళాడు. సాధారణంగా వాళ్ళు సర్క్యులేషన్ తో నిమిత్తం లేకుండా అన్ని పత్రికలనూ కొంటారు.

అయితే ఆరోజు ఆదివారం కావడంతో జిల్లా గ్రంథాలయంలో న్యూస్ పేపర్ సెక్షన్ ఉందేకాని. మాగజైన్ సెక్షన్ తెరిచిలేదు. ఉసూరుమంటూ తిరిగి వచ్చాడు.

ఆ రోజు కూడా ఆ కథని గురించిన ఆలోచనలే అతన్ని వెన్నాడాయి.

మర్నాడు ప్రొద్దున ఏదో పనుందని చెప్పి, బాగా ముందు బయలుదేరి తిన్నగా

జిల్లా గ్రంథాలయానికి వెళ్ళాడు. వాళ్ళు తెప్పించే పత్రికల లిస్టు చూసుకుని, అందులో కథలు ప్రచురించే పత్రికలు అన్నీ కూడా గాలించి చూశాడు. వాటి వేటిలోనూ లేకపోవడంతో మొత్తం అక్కడికి వచ్చే పత్రికలన్నీ కూడా చూశాడు. ఎందులోనూ అటువంటి పత్రిక లేదు.

బహుశా ఆ పత్రికేదో ఒకటి రెండు సంచికలొచ్చి ఆగిపోయి ఉంటుంది. పోనీ పాతపత్రికలు చూద్దామంటే, ఏ పత్రికని చెప్పడం? ఏ తేదీదని చెప్పడం? ఇంక అది ఎండమావుల వెంట వేట అని ఖాయంచేసుకొని ఆ అన్వేషణ అప్పటికి ఆపేశాడు. ఆఫీసుకి రావడం అరగంట ఆలస్యం అయింది కాని ఫలితం మాత్రం దక్కలేదు.

ఇంక ఒక్కటే మార్గం మిగిలింది.

మొన్నటిరోజున రికార్డ్ నోట్ బుక్స్ కొన్న షాప్‌కి వెళ్ళి ఆ పత్రిక లోని కాగితాలు ఏమైనా బైఛాన్స్ దొరుకుతాయేమోనని ప్రయత్నించడ మొక్కటే మార్గం.

సాయంత్రం ఆఫీసు అవగానే తిన్నగా ఆ షాప్‌కి వెళ్ళాడు. తాను అడగదలచు కున్న విషయం చాలా సిల్లీగా ఉంటుంది. అయినా వాళ్ళేమనుకున్నా సరేనని అడగ డానికే నిశ్చయించుకున్నాడు.

వెంకటపతి వెళ్ళేసరికి షాపులో కొంతమంది ఉన్నారు. అయితే స్కూల్స్ ఓపెనింగ్ సీజన్ కాకపోవ డంతో పెద్ద రద్దీగా లేదు.

వెంకటపతిని చూడగానే "ఏంకావాలి సార్?" అని అడిగాడు షాపు యజమాని.

ఏం సమాధానం చెప్పాలో తోచలేదు అతనికి.

బుర్ర గోక్కుంటూ కొంచెం ఆలో చించి, "చూడండి మొన్న సాయంత్రం మీ దగ్గర రికార్డ్‌బుక్స్ కొన్నాను. దాని మీద రేపర్‌గా రద్దీ కాగితం వేశారు. ఆ కాగితాలు ఇంకా ఉన్నాయేమో కావాలి" అంటూ జేబులోంచి ఆ పాత కాగితాన్ని చూపించాడు.

ముందు అతని ప్రశ్న షాప్ యజమానికి అర్థంకాలేదు. అర్థం అయ్యాక నవ్వుతూ "బలేవారే సార్ మీరు, రద్దీ కాగితాలు ఉంటాయా? ఎప్పటికప్పుడు వాడేస్తుంటాం" అన్నాడు.

"పోనీ ఇప్పుడు మీ దగ్గరవున్న రద్దీ కాగితాలు ఒక్కసారి చూపించండి. దొరుకుతుందేమో చూసుకుంటాను" అన్నాడు వెంకటపతి.

షాపు యజమాని ఏమనుకున్నాడో ఒక్కక్షణం ఆలోచించి "సరే చూసు కోండి" అంటూ పాకింగ్ కోసం పక్కన ఉంచిన పాతకాగితాల కట్టను ఇచ్చాడు.

అదృష్టం!

అందులో ఆ పత్రిక దొరికింది. పేరు "యామిని."

ఆ కథ పేరు "ముగింపులేని కథ"- రచన- అన్వేషి.

అయితే ఆ కథ చివరికాగితాలు లేవు. అందువల్ల ముగింపు ఏమిటో తెలీదు.

ఏమైతేనేం... ఈ ఆధారం చాలు... ఆ రచయితని పట్టుకోడానికి ఆ పత్రిక దొరగ్గానే, పట్టరాని ఆనందం కలిగింది వెంకటపతికి. పట్టువదలకుండా జరిపిన అన్వేషణ ఫలించినందుకు ఏనుగెక్కినంత సంబరమయింది.

ఆ పేపర్‌కి డబ్బులివ్వబోయినా తీసుకోలేదు షాప్ యజమాని. "తీసుకొండి సార్...పాతపేపరేగా" అన్నాడు మర్యాదగా. ఆ పత్రికను తీసుకుని పేజీలు తిరగేశాడు.

మంచి స్టాండర్డ్‌తో నడపాలని చేసిన ప్రయత్నం ప్రస్ఫుటంగా కనిపించింది. అందుకేనేమో బహుశా అదే తొలి, చివరి సంచిక కూడా అయి వుంటుంది.

ఆ పత్రిక పేరు వెంకటపతి ఎప్పుడూ వినలేదు.

పత్రిక పేరేకాదు- ఆ రచయిత... అన్వేషి పేరు కూడా వినలేదు.

అది కలంపేరని స్పష్టంగా తెలుస్తోంది.

ఆ పేరుతో ఇప్పుడైతే ఎవరూ రాయడంలేదు.

ఆ పత్రిక రెండేళ్ళ కిందటిది.

అసలు ఆ రచయిత ఇప్పుడు ఉన్నాడో లేడో కూడా.

ఉంటే ఎందుకు రాయడూ? కలం పేరు మార్చుకున్నాడా? సొంత పేరుతో రాస్తున్నాడా? ఏమో?

అసలు బతికేఉన్నాడా?

ఆ పత్రిక సంపాదకుని కలుసుకుంటేనే వీటికి సమాధానం లభించేది. అదృష్టవశాత్తు ఆ పత్రిక ఆ ఊరినుంచే వెలువడింది.

వెంటనే ఆ అడ్రసుకి బయలుదేరాడు వెంకటపతి.

దురదృష్టం!


ఆ పత్రిక యజమాని రెండేళ్ళ క్రితమే దాన్ని మూసేసి మచిలీపట్నానికి వెళ్ళిపోయాడని తెలిసింది. అయితే అడ్రసుమాత్రం చెప్పలేకపోయారు, ఆ ఇంటివారు.

మర్నాడు పోస్టాఫీసుకి వెళ్ళి యామిని పత్రిక యజమాని కొత్త అడ్రసు గురించి అడిగాడు వెంకటపతి.

రెండేళ్ళ క్రిందట రికార్డ్సు చూడటానికి ముందు విసుక్కున్నా ఆ తర్వాత ఓపిగ్గా వెతికి ఆ మచిలీపట్నం అడ్రసు ఇచ్చాడు పోస్టుమాస్టరు.

అక్కడే కవరు కొని, ఆ కథానిక రచయిత అడ్రసు తెలుపవలసిందిగా కోరుతూ, ఆ పత్రిక యజమానికి ఉత్తరం రాశాడు.

పదిహేను రోజులు గడిచినా అక్కడి నుంచి ఎట్టి సమాధానం లేదు. అసలు




ఆయన అక్కడ ఉన్నాడో లేడో- మరో చోటికి పోయాడో లేక ఈ లోకంనుంచే పోయాడో!

ఆయనకి ఆ ఉత్తరం అందించడానికి వీలులేకపోతే, తన ఉత్తరం తనకి తిరిగి రావాలిగా। కవరుమీద తన అడ్రసుకూడా రాశాడాయే. కాని ఈ రోజుల్లో అంత శ్రమ తీసుకుని శ్రద్ధగా రిటరన్ చేసే వాళ్ళెవరు? ఇంక ఆ విషయమై ఆశ వదలుకున్నాడు వెంకటపతి.

అయితే ఈలోగా స్థానికంగా వున్న అన్ని పత్రికలలోనూ 'అన్వేషి' గురించి వాకబు చేశాడు కాని ఎవరూ ఆ పేరుతో రచయిత ఉన్నట్లు చెప్పలేదు. ఈ అన్వేషిని గురించిన అన్వేషణ కేవలం మృగయాన్వేషనేనని ఇంక ఊరుకున్నాడు వెంకటపతి.

ఇరవై రోజుల తర్వాత మచిలీపట్నం నుంచి సమాధానం వచ్చింది. తాను అక్కడ రెండుమూడిళ్ళు మారాననీ అందువల్ల ఉత్తరం ఆలస్యంగా అందిందనీ, పైగా వృద్ధాప్యంవల్ల ఓపిక నశించి వెంటనే జవాబు వ్రాయలేక పోయాననీ క్షమాపణలు చెప్పుకుంటూ ఎంతో మర్యాదగా ఉత్తరం రాశాడాయన. అందులో ఆ అన్వేషి పేరు "కె.యస్. ఆర్. మూర్తి" అని వ్రాస్తూ అతని అడ్రసు ఇచ్చాడు.

ఆ అడ్రసు వెంకటపతి ఇంటికి దగ్గరే.

అది చూడగానే ప్రాణం లేచివచ్చినట్లయింది వెంకటపతికి.

ఇన్నాళ్ళ శ్రమ ఫలించిందన్న ఆనందం కలిగింది.

ఆఫీసు వదిలిపెట్టగానే తిన్నగా ఆ

ఇంటికి వెళ్ళాడు.

అది సందుగొందుల్లో మురికికూపాల మధ్య ఉన్న పడిపోయేట్లున్న ఒక పాత పెంకుటిల్లు- దాంట్లో ఓ గదిలో ఉంటు న్నాడు అతను.

అసలు ఆ ఇల్లు కనుక్కోడమే గగనం అయింది.

తీరా కనుక్కున్నాక అతను ఇంట్లో లేడని తెలిసింది.

ఎక్కడో పనిచేస్తాడనీ పొద్దున ఎనిమిదింటికి వెళ్తే తిరిగి రాత్రి పది దాటాకనే కాని రాడని తెలిసింది.

అసలు ఆ మనిషి ఉన్నాడని నిర్ధారణ కావడంతో, తృప్తి కలిగింది అతనికి. అతను కనిపించలేదన్న నిరాశ అంతగా అనిపించలేదు.

మర్నాడు ప్రొద్దున్నే ఏడు గంటలకే ఆ ఇంటికి వెళ్ళాడు వెంకటపతి. తన కోసం ఎవరో పెద్దమనిషి రావడం ఆశ్చర్యంలో ముంచింది అతన్ని.

"ఎవరు కావాలండీ?" అని అడిగాడు.

"మూర్తిగారు ఉన్నారా?" అని అడిగాడు.

అతన్ని చూస్తే ఎక్కడో చూసినట్లు అనిపించింది వెంకటపతికి. "నేనేనండీ. లోపలకి రండి. సార్- మీరు కూర్చోడా నికి కూడా ఇక్కడేమీ లేదు ఈ చింక్ చాప తప్ప," అన్నాడు బాధతో.

"పర్వాలేదులెండి" అంటూ దాని మీదే కూర్చున్నాడు.

అతని చేతిలోవున్న పత్రిక చూసి "సార్... ఓసారి ఆ పత్రిక ఇస్తారా?" అన్నాడు ఆ వ్యక్తి.

అప్పుడు తక్కున జ్ఞాపకం వచ్చింది అంతకు ముందు హోటల్లో జరిగిన సంఘటన.

"మీ పేరు నటరాజు కదూ," అన్నాడు ఆశ్చర్యంగా.

"అవునండి, కె. నటరాజమూర్తి. కె.యన్.ఆర్. మూర్తి అంటారు." ఆ మాటలు వినగానే ఎవరో కొరడాతో చెళ్ళున కొట్టినట్లయింది వెంకటపతికి.

"అన్వేషి పేరుతో రచనలు చేసేది మీరేనా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవునండీ—అది చాలా పాతకాలం నాటి మాట," అన్నాడు అతను.

"నా పేరు..." అంటూ చెప్పబో యాడు వెంకటపతి.

"మీరు నాకు తెలుసు సార్. వెంకట పతిగారు. మంచి రచయితలు, మిమ్మల్ని చాలాసార్లు చూశాను" అన్నాడు అతను.

సిగ్గుతో తల కొట్టేసినట్లయింది వెంకటపతికి.

ఆ రోజు తాను- ఒక రచయిత అయ్యుండీ- ఎంత అవమానకరంగా ప్రవర్తించాడు. అతను అప్పుడు కనీసం నోరు కూడా విప్పలేదు. పైగా అదేమీ మనసులో పెట్టుకోకుండా ఎంత మర్యా దగా మాట్లాడుతున్నాడు.

అతని వ్యక్తిత్వం హిమాలయాల




నంటుతుంటే. తనది పాతాళానికి తగులుతున్నట్లనిపించింది.

“రెండేళ్ళ క్రితంనాటి యామిని పత్రికలో మీ కథ ‘ముగింపులేని కథ’ చూశాను. దానిలో చివరి పేజీలు లేవు. ఆ కథ నాకు చాలా నచ్చింది. దాని ముగింపు ఎలా తీసుకువచ్చారో తెలుసుకోవాలని వచ్చాను.” అన్నాడు వెంకటపతి తేయకొని.

“పాత జ్ఞాపకాలను పైకి తెచ్చారన్న మాట. అది ముగింపు లేని కథ సార్!”

“అంటే?” ఆశ్చర్యంగా అడిగాడు

వెంకటపతి.

"అది నా జీవితం సార్! ఇది ఇంకా ముగియలేదు." అన్నాడు బాధగా.

"సారీ: మిమ్మల్ని నొప్పించినట్లు న్నాను. మీ గురించి తెలుసుకోవాలని ఉంది. మీతో పరిచయం పెంచుకోవాలని ఉంది."

"నేను అంత పెద్దవాడిని కాదు సార్! నా జీవితం గురించి అడిగారు కాబట్టి చెప్తున్నాను. మీరూ రచయితలే కాబట్టి దీనిలో మీకు నచ్చిన అంశాలను కథలుగా మలచవచ్చు.

"మాది బ్రతికి చెడ్డ కుటుంబం. చాలా కష్టంమీద బి.ఏ. చదివాను. కాని నా చదువు నా మీద ఆధారపడ్డ తల్లి, తమ్ములు, చెల్లెళ్ళకి కూడు పెట్టలేక పోయింది. అటువాళ్ళని పోషించలేక, వాళ్ళకి బరువుగా ఉండలేక ఇల్లు వదిలి వచ్చేను. ఏ ఉద్యోగం దొరక్క చివ రికి హోటల్‌లో సర్వర్‌గా చేరాను.

నాకు మొదటినుంచీ కథలు రాయడం సరదా. మంచి కథలు చాలా రాశాను. కాని ఏ పెద్ద పత్రికా వాటిని ప్రచురించ లేదు. అన్నీ క్షేమంగా తిరిగివచ్చేవి. కొత్త రచయితను కాబట్టి, నా కథలు చదివే ఓపిక వారికి ఉండదేమో అని పించేది. యామినిలాంటి రెండు మూడు పత్రికలలో మాత్రమే నా కథలుపడ్డాయి. అయితే అవేవీ నిలవలేదు. వాటితోనే నా అన్వేషి పేరు అంతరించింది. పూర్తి నిరాశతో చాలాకాలం కలం ముట్టుకో లేదు. పైగా నా ఆరోగ్యం అంతంత మాత్రం. హోటల్లో చేసేది గొడ్డుచాకిరి. ఇంక ఏం రాస్తాను. కాగితం కొనాలన్నా డబ్బుండాలిగా.

"అలాగే కొంచెం కూడబెట్టుకుని, ఆత్మని చంపుకుని 'రజని' అన్న ఆడ పేరుతో ఏడెనిమిది నెలలబట్టి, ఈనాడు వస్తున్న వ్యాపారసరళి రచనలు మొదలు పెట్టాను. ఇవి ప్రచురితమవుతున్నాయి. ఇప్పుడిప్పుడే పేరులోకి వస్తున్నాను. అన్వేషి - నటరాజు అస్తమించారు, ఇప్పుడు ఉదయించింది రజనే. మిగిలేది రజనే." అన్నాడు అతను.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది వెంకట పతికి, రజనిపేరుతో రచనలు చదివినట్లు.

"పత్రికలు కొనేస్థోమత నాకు లేదుసార్! నా రచనలు పడ్డవాటినికూడా కొందరు పంపుతారు, కొందరు పంపరు. కొన్ని పోస్ట్‌లో పోతాయి. అందువల్ల ఎవరి చేతిలోనైనా నేను పంపిన పత్రికవంటిది కనిపిస్తే, నావేమైనా పడ్డాయేమోనని చూడ్డంకోసం అడుగుతుంటాను" అన్నాడు మూర్తి.

ఆ మాటలు వింటూంటే ఆనాడు హోటల్లో జరిగింది జ్ఞాపకానికి వచ్చింది. తన పేరు చెప్పకుండా తనకా విషయం గుర్తుచేసినట్లనిపించింది, తల కొట్టేసి నట్లయింది.

అతను మళ్ళీ చెప్పసాగాడు.

"సార్! ఆ 'ముగింపులేని కథ' మీకు నచ్చిందన్నారు. అది నాకూ బాగా నచ్చిన కథ సార్! దానిని ఇంగ్లీషులో అనువదించి కష్టంమీద ఎంతో ఖర్చుతో టైపు చేయించి అంతర్జాతీయ పోటీకి పంపాను. దానికి బహుమతి వస్తుందని నమ్మకం లేదు కానీ రిజల్టు తెలుసుకోవాలని ఉంటుందిగా! పేపర్లుచూచే శక్తి లైబ్రరీకిపోయి చూసే టైము నాకు లేవు. మీరు చూస్తే నాకు కొంచెం చెప్పండి సార్!" అన్నాడు దీనంగా.

"అన్నట్టు ఆ కథ మీకు కావాలన్నారుగా! అది ఎవరికో ఇచ్చాను. వెతికి సంపాదించి మీకు త్వరలో ఇస్తాను. అన్నాడు మళ్ళీ.

మరికొంచెం సేపు మాట్లాడాక మళ్ళీ కలుస్తానని చెప్పి వెళ్ళిపోయాడు వెంకటపతి.

* * *

నెల రోజులు గడిచింది. ఆ నెలంతా టూర్లు, పని ఎక్కువగా ఉండడంతో మళ్ళీ మూర్తిని కలుసుకోలేకపోయాడు.

ఆ రోజు అంతర్జాతీయ కథల ఫలితాలు వచ్చాయి.

మూర్తి కథకి రెండో బహుమతి వచ్చింది. తానూ పంపాడే కానీ ఏమీ రాలేదు.

ఆ శుభవార్త చెప్పాలని మూర్తి హోటల్‌కి వెళ్లాడు వెంకటపతి. కాని అతను రాలేదని తెలిసి ఇంటికి వెళ్ళాడు

అతని ఇంటిముందు కొద్దిమంది గుమిగూడి ఉన్నారు.

ఎవరో చనిపోయారు.

దగ్గరికి వెళ్ళి చూసేసరికి - అది మూర్తి శవం.

మూర్తికి టి.బి ముదిరిందని పని లోంచి తీసేశారట హోటల్ వాళ్ళు. తిండీతిప్పలు సరిగా లేక, మందులు లేక నానాయాతనపడి, ఆ పొద్దూన్నే నెత్తురు కక్కుకుంటూ కన్ను మూశాడట! ఇరుగుపొరుగువారు శవదహనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అతని వాళ్ళు ఎవరేనా ఎక్కడుందీ వాళ్ళకి తెలీదు.

వాళ్ళలో ఒకాయన "చాలాసార్లు ఎవరో పతిగార్ని చూడాలని కలవరించాడు బాబూ!" అని అన్నాడు.

"ఆ పతిని నేనే సార్!" అన్నాడు ఆత్రంగా.

"చాలా ఆలస్యంగా వచ్చారు. సార్! మీరు వస్తే ఓ కవరు ఇమ్మన్నాడు." అంటూ లోపలనుంచి తెచ్చి ఇచ్చాడు.

అందులో అతని కథ 'ముగింపు లేని కథ' ఉంది.

అది చూడగానే కడుపులో దేవినట్లయింది వెంకటపతికి తననే తలచుకుంటూ కన్నుమూసిన వ్యక్తిని చూడలేకపోయినందుకు ఎంతో బాధ కలిగింది. వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ "నీకు అంతర్జాతీయ పోటీల్లో రెండో బహుమతి వచ్చింది మూర్తీ" అంటూ ఆ పేపరుని ఆ శవంమీద ఉంచాడు. మనసులో 'మూర్తీ... నీది ముగింపు లేని కథ అన్నావు. కాని నీ కథ ఇలా ముగిసిందా?' అని ఎవరో అంటున్నట్లు పదేపదే వినిపించసాగింది. * *